

బోటింగ్ డ్రెస్‌లో చంద్రబాబు



పరమ సముద్రం చెరువులో చంద్రబాబు బోటింగ్



హంద్రీ-నీవా కాలువ వద్ద జనం హర్షాతిరేకాల నడుమ జలహారతి ఇస్తున్న చంద్రబాబు

నిలువెల్లా పులకింత... జనమెల్లా కేరింత!

- జలహారతిలో మెరిసిన 'చంద్ర'హాసం
- సీఎం కుప్పం పర్యటన విజయవంతం

పంచెకట్టులో నిండైన రూపం.. పెదవులపై చెరగని దరహాసం..ఆనందంతో జనాలకు అభివాదం.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పటిలా కాకుండా భిన్నంగా కనిపించారు, వ్యవహరించారు. అధినేతకు జేజేలు.. ప్రాంగణమంతా ఈలలు.. మాటమాటకీ పట్టలేని ఆనందంతో గోలగోలలు.. జడత్వాన్ని వదుల్చుకున్న జనం ఆయనకు బ్రహ్మరథం పట్టారు. చంద్రబాబులో ఎన్నడూ లేని పులకింత కనిపించగా.. జనంలో నిస్తేజం పటాపంచలై కేరింతలతో వెల్లువెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన ఎప్పటిలా కాకుండా, నూతనత్వంతో అద్యంతం ఉత్సాహం ఉరకలు వేసేలా విజయవంతంగా సాగి ముగిసింది.



సభకు హాజరైన జనం- చంద్రబాబు అభివాదం



హంద్రీనీవా పైలాన్ ఆవిష్కరణ

కుప్పం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 738 కిలోమీటర్లు సాగి, తరలి వచ్చిన కృష్ణమ్మకు కుప్పంలోని పరమసముద్రం చెరువు వద్ద హంద్రీ-నీవా కాలువలో ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం జలహారతి ఇచ్చారు.ఆ సమయంలో ఆయన ఆహార్యం చూసిన జనం ఆశ్చర్యపోయారు. శాంతిపురం మండలంలో ఇటీవలి స్వగృహ ప్రవేశంలో తప్ప, ఆయన కుప్పం ప్రజలకు ఎన్నడూ, ఏ కార్యక్రమంలోనూ పంచెకట్టులో కనిపించక పోవడం, ఇప్పుడు నిండైన పంచెకట్టుతో కనువిందు చేయడమే వారి ఆశ్చర్యానికి కారణం. కేవలం జలహారతి సమయంలోనూ కాదు.. తర్వాత జరిగిన బహిరంగ సభలో కూడా ఆయన పంచెకట్టు, షర్టుతోనే పాల్గొనడం వారిలో మరింత ఆశ్చర్యంతోపాటు ఆనందాన్ని కలిగించింది. తెలుగు సంప్రదాయంలో గంగమ్మను పూజించుకోవడమే కాక, సంప్రదాయ దుస్తులను పర్యటన ఆద్యంతం ధరించడం ప్రధాన విశేషంగా ప్రజలు చెప్పుకున్నారు. అంతేనా.. చంద్రబాబు ప్రసంగం ఎప్పటిలా హైఫై గా సాగలేదు. జలాలు.. పొలాలు.. హలాలు.. ఆయన వాక్యంలో అడుగడుగునా పలకరించాయి. సభ ప్రారంభం నుంచి ముగిసే వరకూ ఆయన పెదవులపై సంతృప్తికర హాస రేఖలు తొంగిచూశాయి. షెడ్యూల్ ప్రకారం చంద్రబాబు కచ్చితంగా ఉదయం 10.30గంటలకు శాంతిపురం మండలం కడపల్లె వద్ద గల ఇంటినుంచి బయటకు వచ్చి వివిధ పథకాల లబ్ధిదారులతో అప్పటికే నిండిన ఆర్టీసీ బస్సు ఎక్కారు. ఒక కుటుంబ సభ్యుడిలా వారిని పలుకరిస్తూ, కష్టసుఖాలు ఆరాతీస్తూ, పథకాల ద్వారా పొందుతున్న లబ్ధి వివరాలు తెలుసుకుంటూ పరమసముద్రం చెరువు వద్దకు చేరుకున్నారు. సమీపంలోని హంద్రీ-నీవా కాలువలో ముహూర్తం వేళ అయిన ఉదయం 11.30 గంటలకు జలహారతి ఇచ్చి కృష్ణమ్మకు పూజలు చేశారు.తర్వాత పైలాన్ ఆవిష్కరణకు ముందు హంద్రీ-నీవా రూట్ మ్యాప్ పరిశీలించారు. సంబంధిత ఫొటోలతో కూడిన ఎగ్జిబిషన్ సందర్శించారు. హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు ఆయా వివరాలను సీఎంకు వివరించారు. కాలువ పొడవునా సీసీ కెమెరాలు పెట్టి భద్రతా చర్యలు తీసుకోవాలని, హంద్రీ-నీవా కాలువ ప్రయాణం, అందుకు ప్రభుత్వం పడిన ఇబ్బందులు, సాధించిన విజయాలు, ఫలితాలను సూచించేలా, చిన్నలు పెద్దలకు అర్థమయ్యేలా నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర కేంద్రాలలో ప్రత్యేకమైన ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అందుకు ఎంత వ్యయమైనా భరించేందుకు తాను సిద్ధమన్నారు. అనంతరం హంద్రీ-నీవా కాలువ నిర్మాణం పూర్తయి కృష్ణా జలాలు కుప్పం చేరినందుకు గుర్తుగా నిర్మించిన పైలాన్‌ను ఉదయం 11.50 గంటలకు ఆవిష్కరించారు.అనంతరం చంద్రబాబు జనాల ఆనందాన్ని పంచుకుంటూ వారితో కలిసి సెక్యూరిటీ లేకుండా కాలువ గట్టు వెంట పరమసముద్రం చెరువు వద్దకు నడుచుకుంటూ వెళ్లిపోయారు. అక్కడ అప్పటికప్పుడు సిద్ధం చేసిన బెలూన్ తెప్పలో ఎక్కి చెరువంతా కలియదిరిగారు. ఈ కార్యక్రమం షెడ్యూల్‌లో లేకపోయినా ఆయనలో ఉరకలు వేసే ఉత్సాహం ఈ పనిచేయించింది. తర్వాత సుమారు గంట ఆలస్యంగా మధ్యాహ్నం 1.45 గంటలకు బహిరంగ సభావేదికకు చేరుకున్నారు.

● ఉరవడిగా సాగిన ప్రసంగం

సాధారణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం పడికట్టు పదాలతో పునరావృతమయ్యే వాక్యాలతో సాగుతుంది. అయితే జలహారతి సందర్భంగా ఆయన ప్రసంగం ఒక ఉరవడిలో, హంద్రీ-నీవా కాలువలో ఉరకలెత్తే కృష్ణా ప్రవాహంలా సహజ ఉద్ధృతితో సాగింది. మధ్యాహ్నం 1.32 గంటలకు ప్రారంభమైన ఆయన ప్రసంగం ఏకధాటిగా సుమారు 1.15 గంటపాటు కొనసాగి మధ్యాహ్నం 2.45 గంటలకు ముగిసింది. జలాలే జీవితం అని ప్రతిపాదించిన చంద్రబాబు, హంద్రీ-నీవా కాలువను శ్రీశైలంనుంచి కుప్పం దాకా నిర్మించి కృష్ణా జలాలతో కరువు నేలను పావనం చేయడానికి తాను ఎన్ని కష్టాలు పడిందీ, మధ్యలో వైసీపీ పాలనలో ప్రాజెక్టు ఎలా ఆగిపోయిందీ, తిరిగి మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎంత పట్టుదలతో కాలువ నిర్మాణం పూర్తిచేసి కృష్ణమ్మను కుప్పం తీసుకు వచ్చిందీ సవివరంగా ప్రజలకు తెలియజెప్పారు. కుప్పానికి రెండేళ్ల ముందే కృష్ణా పుష్కరాలు వచ్చాయని చమత్కరించిన ఆయన, జలాల ప్రాముఖ్యత, అన్నదాతకు వాటి అవసరం, పాడిపంటలతో జీవితాలు సుఖవంతం కావడం వంటి అంశాలతో గ్రామీణ ప్రాంత ప్రజల మనసులను చూరగొన్నారు. కరువు నేలలో బోర్లు వేసి నీళ్ల పడక నష్టపోయిన రైతు ముఖంలో కృష్ణమ్మ తెచ్చిన ఆనందాన్ని తన మాటల్లో వర్ణించారు. వరి వద్దని, వాణిజ్య పంటలే వేయమని సలహా ఇచ్చారు. తన సహజ శైలికి భిన్నంగా అచ్చమైన రైతు బిడ్డలా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతుంటే సభకు హాజరైన గ్రామీణ జనం మంత్రముగ్ధులై విన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు వేదిక వెనుక ప్రత్యేకంగా వేసిన గుడారంలోకి వెళ్లి, కుప్పంలో ప్రాజెక్టులు నిర్మించనున్న 5 కంపెనీలతో కడా ద్వారా ఒప్పందాలు కుదుర్చుకున్నారు.షెడ్యూల్‌లో పేర్కొన్న సమయానికి సుమారు 2 గంటలు ఆలస్యంగా సాయంత్రం 6 గంటలకు హెలికాప్టర్ ద్వారా బెంగళూరు పయనమయ్యారు.



బస్సులో రైతుతో మాట్లాడుతున్న చంద్రబాబు

2న పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

చిత్తూరు అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబరు రెండో తేదీన చిత్తూరులోని పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీ నిర్వాహకులతో ఈ మేళా జరగనున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విప్రో, యాక్సిస్ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న 300 పోస్టులను భర్తీ చేస్తారన్నారు. డిగ్రీ వరకు చదివిన 18-35 ఏళ్లలోపు యువతీ యువకులు అర్హులన్నారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మరో మూడు 'విండో'లకు పాలకవర్గాల నియామకం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్వహణలోని మూడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (సింగిల్ విండో)లకు నాన్-అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. శ్రీరంగరాజపురం సింగిల్‌విండోకు ఛైర్మన్‌గా కె.నిరంజన్ కుమార్ రెడ్డి, సభ్యులుగా డి.హేమాద్రి, పి.నాగరాజులను నియమించారు. అలాగే కార్వేటినగరం విండోకు ఛైర్మన్‌గా ఎం.జనార్దన్ రాజు, సభ్యులుగా సి.చిన్నబ్బ, ఆర్.జయచంద్రన్‌లను ప్రభుత్వం నియమించింది. ఈ పాలకవర్గం పదవి చేపట్టిన రోజు నుంచి 2026 జనవరి 30వ తేదీవరకు లేదా సింగిల్ విండోలకు ఎన్నికలు జరిగేవరకు కొనసాగుతారని ఆ ఉత్తర్వులో పేర్కొంది. ఇక దిగువమాఘం సింగిల్ విండోకు ఛైర్మన్‌గా గుర్రం వెంకటేష్ చౌదరి, సభ్యులుగా డబ్ల్యూ కుమార్, ఎంఆర్ మునిరత్నం నియమితులయ్యారు. వీరు మాత్రం పదవీ బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి 2025 అక్టోబరు 30వ తేదీవరకు లేదా ఎన్నికలు జరిగేవరకు పదవిలో ఉంటారని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

ముగిసిన బార్ల లాటరీ ప్రక్రియ

చిత్తూరు సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న బార్లకు లాటరీ ప్రక్రియను పూర్తిచేశారు. ప్రభుత్వం జిల్లాలో 11 బార్లకు దరఖాస్తులు ఆహ్వానించింది. ఇందులో చిత్తూరులో రెండు బార్లకు, గీత కులాలవారికి కేటాయించిన ఓ బార్‌కు, కుప్పం, పుంగనూరులో ఒక్కో బార్‌కు నాలుగు చొప్పున 20 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.కోటి ఆదాయం వచ్చింది. ఈ బార్లను శనివారం కల్టెరేట్‌లోని డీఆర్‌డీఏ మీటింగ్ హాల్‌లో డీఆర్వో మోహన్ కుమార్ లాటరీ ద్వారా దరఖాస్తుదారులకు కేటాయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డీసీ విజయ్ శేఖర్, ఈఎస్ శ్రీనివాస్, సీఐలు శ్రీహరి రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



లాటరీ తీస్తున్న డీఆర్వో మోహన్ కుమార్

మూషిక వాహనంపై వినాయకుడి విహారం





మూషిక వాహనంపై వినాయక స్వామి- పట్టువస్త్రాలను తీసుకొస్తున్న కనకదుర్గమ్మ ఆలయ ఈవో శీనానాయక్,ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్‌తో వరసిద్ధుడి ఆలయ ఈవో కిషోర్

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారు మూషిక వాహనంపై విహరించారు. కాణిపాకం, తిరువణంపల్లె, అగరంపల్లె, కాణిపాకపట్నం, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చినకాంపల్లె గ్రామాలకు చెందిన విశ్వకర్మ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం మూలవిరాట్‌కు ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం చేశారు. అనంతరం స్వామికి చందనాలంకారం చేసి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మూలవిరాట్‌ను చందనంతో కప్పి స్వామి రూపం స్పష్టంగా కనపడేలా ఉల్లెన్ దారాలను వినియోగిస్తారు. అందువల్ల స్వామిని దర్శించు కోవడానికి భక్తులు ఎంతో ఇష్టపడతారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరుస తీసుకొచ్చి అలంకార మండపంలో ఉత్సవర్లకు విశేష పూజలు నిర్వహించాక భక్తులకు ప్రసాదాలు పంచారు. తర్వాత సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవర్లను మూషిక వాహనంపై ఉంచి కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. కాగా విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం తరఫున ఈవో శీనానాయక్, ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్ శనివారం స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వీరిని ఈవో పెంచలకిషోర్ సాదరంగా ఆహ్వానించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్‌కు ఈ పట్టు వస్త్రాలను అందించారు. ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, ధనపాల్, ధనంజయ, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు పాల్గొన్నారు.వరసిద్ధుడికి ఆదివారం ఉదయం బంగారు చిన్న శేషవాహన సేవ, రాత్రి బంగారు పెద్ద శేషవాహన సేవ జరగనుంది.









తిరుపతిలోని ఎమ్మార్‌పల్లె : తులాభారం వినాయకుడు - వేషాలమ్మ ఆలయం వద్ద : ఐదు తలల పాముపై.. - అరవపల్లివీధి : పండ్ల చెట్టుపై ఊగుతున్న వినాయకుడు - నిమ్మకాయల వీధి : బ్రహ్మ రూపంలో.. - పరసాలవీధి : నంది వాహనంపై..

'కిక్' ఇవ్వని దరఖాస్తులు

- జిల్లాలో ఆరు బార్లకు నిల్
- ముగిసిన లైసెన్స్‌ల లాటరీ ప్రక్రియ



బార్లకు లాటరీ తీస్తున్న కలెక్టర్


తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగిన బార్ల లైసెన్స్ లాటరీ విధానం పారదర్శకంగా ముగిసింది. తిరుపతి మినహా జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఆశించిన మేర దరఖాస్తులు రాలేదు. దరఖాస్తుల గడువు పొడిగించినా సరైన స్పందన లేదు. ఈ ప్రభావం ఎక్సయిజ్ ఆదాయంపై పడుతుందని భావిస్తున్నారు. కాగా కలెక్టర్ వెంకటేశ్వర్ లాటరీ తీసి, దరఖాస్తుదారులకు లైసెన్స్‌లు కేటాయించారు. మొత్తం 29 బార్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా 23కు మాత్రమే దరఖాస్తులు అందాయి. ఇందులో తిరుపతి నగరంలో అత్యధికంగా 17 బార్లకు గాను 149 దరఖాస్తులు వచ్చాయి. పరిశీలించిన అధికారులు అత్యధికంగా టెండర్ కోడ్ చేసిన 17 మందికి లాటరీ పద్ధతిలో కేటాయిస్తూ లైసెన్సులు జారీ చేశారు. చంద్రగిరి, పుత్తూరులో రెండు బార్లకు నాలుగు చొప్పున దరఖాస్తులు వచ్చాయి. శ్రీకాళహస్తి పట్టణ పరిధిలోని ఒక బార్‌కు దరఖాస్తులు అందలేదు. నాయుడుపేట పరిధిలో ఒక బార్‌కు నాలుగు దరఖాస్తులు అందాయి. గూడూరు పరిధిలో మూడు బార్లకు గాను ఒక దానికి మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. సూళ్లూరుపేటలో రెండు బార్లు, వెంకటగిరిలో ఒక బార్‌కు దరఖాస్తులు అందలేదు. మొత్తంగా 23 బార్లకు దరఖాస్తులు అందగా ఒక్కో దరఖాస్తు రుసుం రూ.5లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు కింద మరో రూ.10వేలు చెల్లించారు. తద్వారా ప్రభుత్వానికి రూ.8.82 కోట్లు ఆదాయం వచ్చింది. ఇక రిజర్వేషన్ కేటగిరీ కింద గీత కార్మికుల కోసం కేటాయించిన తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరు పరిధిలో మూడు బార్లకు గాను 36 దరఖాస్తులు అందాయి. తద్వారా ప్రభుత్వానికి రూ.1.83 కోట్లు ఆదాయం లభించింది. దీంతోపాటు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూపంలో అదనంగా మరో రూ 2.30 కోట్లు ఖజానాకు ఆదాయం లభించింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి, ఏసీ శ్రీనివాసులు, ఏఈఎస్ వాసుదేవ చౌదరి పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌తో నటుడు సాయికుమార్ భేటీ




తిరుమల, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): సినీనటుడు సాయికుమార్ శనివారం టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవారి దర్శనార్థం ఆయన కుమారుడు ఆదితో కలిసి తిరుమలకు వచ్చారు. సాయంత్రం చైర్మన్ క్యాంపు కార్యాలయంలో బీఆర్ నాయుడిని కలిసి వివిధ అంశాలపై ముచ్చటించారు.

వానాకాలం జ్వరాలతో జాగ్రత్త!



తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

అడపాదడపా ఆగకుండా కురుస్తున్న వానలు జ్వరాలను వ్యాప్తి చేస్తున్నాయి. వానలకు చెట్టూచేమా పెరిగి పరిసరాలు గుబురుగా మారుతున్నాయి. చిన్న గుంటల్లోనూ నీరు చేరి దోమలు వ్యాపిస్తున్నాయి. సీజనల్‌గా వైరల్ జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటివి పెరుగుతున్నాయి. జలుబు, దగ్గు, తలనొప్పితో ఇబ్బంది పడేవారి సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నిరోధానికి ప్రభుత్వ సన్నద్ధత గురించి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్ ఆంధ్రజ్యోతి సంభాషణ...



జిల్లా వైద్యాధికారి అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్



ప్రశ్న : ఈ వర్షాకాలంలో వ్యాధుల నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : నీరు నిలిచే, దోమలు ఉండే ప్రదేశాలను గుర్తించాం. శుభ్రం చేయిస్తున్నాం. తాగునీటి బావులు, బోర్లు, కుళాయిల వద్ద క్లోరినేషన్ చేయిస్తున్నాం. ఎక్కడైనా ఒకటి రెండు జ్వరం కేసులు రాగానే వైద్య శిబిరాల ద్వారా సేవలు అందిస్తున్నాం. పరిసరాల శుభ్రత, దోమల విజృంభణపై గ్రామాల్లో సిబ్బంది ప్రచారం చేస్తున్నారు.

ప్రశ్న: మందులకు, నిధులకు, వైద్యులు, ఇతర సిబ్బందికి కొరత ఉందా?

జవాబు : సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు మందులు సరఫరా అవుతున్నాయి. ప్రభుత్వం విడుదల చేసే రూ.1.75 లక్షలతో మందులు కొనుగోలు చేసుకునే వెసులుబాటు పీహెచ్‌సీలకు కల్పించాం. మరీ ఇబ్బంది ఉంటే జిల్లా కార్యాలయంలోని ఎపిడమిక్ విభాగమే వైద్యశిబిరాలను నిర్వహిస్తుంది. వైద్యుల, సిబ్బంది కొరత లేదు.

ప్రశ్న: ఎలాంటి వైద్య సేవలను అందిస్తున్నారు?

జవాబు : జిల్లాలో 26 యూపీహెచ్‌సీలు, 58 పీహెచ్‌సీల పరిధిలో దాదాపు 70కి పైగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. 160కి పైగా రకాల మందులను ఉచితంగా అందిస్తున్నాం. గ్రామీణ పీహెచ్‌సీల్లో 24 గంటలూ వైద్యసేవలందించేలా అప్రమత్తం చేశాం. సీజనల్ వ్యాధులకు సంబంధించి పరీక్షలు, వైద్య సేవలు ఇక్కడే అందేలా చర్యలు తీసుకున్నాం. అత్యవసరమైతే ప్రాంతీయ, ఏరియా ఆస్పత్రులకు లేదా రుయాస్పత్రికి బాధితులను తీసుకువచ్చి వైద్యం అందిస్తునాం.

ప్రశ్న: పిల్లలు, వృద్ధుల విషయంలో ప్రత్యేక చర్యలు?

జవాబు: వర్షాకాలంలో ఎక్కువగా వ్యాధుల బారిన పడే ది పిల్లలు, వృద్ధులూ. వీరి ఆరోగ్య భద్రతకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. వైద్యారోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పాఠశాలలను సందర్శిస్తున్నారు. జలుబు, దగ్గు వంటి చిన్నపాటి లక్షణాలున్నా వైద్య సహాయం అందిస్తున్నారు. ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహారాన్ని తీసుకోవాలని, చలిని తట్టుకునే దుస్తులను ధరించాలని సూచిస్తున్నాం వృద్ధులు మరీ అవసరమైతే తప్ప ఈ సీజన్‌లో బయటకు రాకపోవడం మంచిది.

ప్రశ్న : ప్రజలకు మీరిచ్చే సూచనలు ఏమిటి?

జవాబు : వర్షాకాలంలో నీటి నిల్వల వల్ల దోమలు వృద్ధి చెంది రోగాలను వ్యాప్తి చేస్తాయి. దోమ తెరలు వాడాలి. దోమల నివారణకు మార్కెట్లలో అమ్మే రసాయనాలతో మరింత జబ్బుల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవడమే శ్రేయస్కరం. చిన్నారులు, వృద్ధులు, ఆస్తమా వంటి బాధితులు చిన్నపాటి అనారోగ్యలక్షణాలున్నా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి వైద్యులను సంప్రదించాలి.

సర్వ దర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.3.39 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 65,717

తలనీలాలు సమర్పించినవారు: 22,445

శ్రీవారిని దర్శించుకున్న బుద్ధ సర్క్యూట్ యాత్ర సభ్యులు



తిరుమల, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): శ్రీవారిని 'త్రిసేనల బుద్ధ సర్క్యూట్ మోటార్ సైకిల్ యాత్ర' సభ్యులు శనివారం దర్శించుకున్నారు. బుద్ధుడి సందేశమైన శాంతి, కరుణ, సౌభ్రాతృత్వాలను దేశమంతా వ్యాప్తిచేయాలనే లక్ష్యంతో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన త్రిసేనల అధికారులు, బిమ్‌స్టెక్ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులతో కూడిన బృందం మోటరు సైకిల్ యాత్రగా శుక్రవారం తిరుపతికి చేరుకున్న విషయం తెలిసిందే. వీరి బృందం శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై వినతులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో నమోదు, తొలగింపు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై రాజకీయ పార్టీల నేతలతో కలెక్టరేట్‌లో శనివారం డీఆర్వో నరసింహులు సమావేశమయ్యారు. చంద్రగిరి నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయని, ఓటర్లు ఎక్కువగా ఉన్న కేంద్రాలను సర్దుబాటు చేయాలని టీడీపీ మహిళా నాయకురాలు సుధారెడ్డి కోరారు. ఒకే కుటుంబానికి సంబంధించిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లకు సంబంధించిన వివిధ సమస్యలను డీఆర్వో దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో నేతలు వరప్రసాద్, నాగార్జున, కలిందర్, చంద్రమోహన్‌రెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు, శ్రీకాళహస్తి ఆస్పత్రులకు సివిల్ సర్జన్ స్పెషలిస్టుల నియామకం

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గూడూరు, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రులకు సివిల్ సర్జన్ స్పెషలిస్టులు నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా కోవూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (జనరల్ సర్జరీ)గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.వెకంటాచలపతి సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా పదోన్నతిపై గూడూరు ఏరియా ఆస్పత్రికి బదిలీ అయ్యారు. అలాగే గూడూరు ఏరియా ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (పీడియాట్రిక్స్)గా పనిచేస్తున్న డాక్టర్ బి.గిరిజ సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా పదోన్నతిపై శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

మెడికల్ అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతి

తిరుపతి నుంచీ ఇద్దరికి బదిలీ... ఇక్కడికి ముగ్గురి రాక

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ మెకడికల్ కళాశాలల్లో అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న పలువురికి ప్రభుత్వం ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించింది. అందులో భాగంగా తిరుపతి ఎస్వీ ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచీ ఇద్దరు పదోన్నతిపై ఇతర ప్రాంతాలకు బదిలీ కాగా ఇతర ప్రాంతాల నుంచీ ముగ్గురు ఈ కళాశాలకు బదిలీపై రానున్నారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో అనస్థీషియా విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె.విజయ్ ప్రొఫెసర్‌గా పదోన్నతిపై నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలకు, ఈఎన్‌టీ విభాగంలో అసోసియేటెడ్ ప్రొఫెసర్ డాక్టర్ పీఎస్ఆర్ రాజేశ్వరి పదోన్నతిపై పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు బదిలీ అయ్యారు. అలాగే శ్రీకాకుళం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఈఎన్‌టీ విభాగం అసోసియేటెడ్ ప్రొఫెసర్ డాక్టర్ పి.రమేష్ చంద్ర, నెల్లూరు ఏసీఎస్ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జనరల్ మెడిసిన్ విభాగం అసోసియేటెడ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌కే షర్మిల, అక్కడే సైకియాట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.పద్మావతి పదోన్నతిపై ప్రొఫెసర్లుగా తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు బదిలీపై రానున్నారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

భవనం పైనుంచి పడి బెంగాల్ కార్మికుడి మృతి


మృతి చెందిన కార్మికుడు

రేణిగుంట ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భవనంపై నుంచి కిందపడి పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని విప్పమానుపట్టెడ గ్రామంలో చోటుచేసుకుంది. గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు.. విప్పమానుపట్టెడ గ్రామంలో ఓ ప్రైవేట్ కళాశాల భవనం నిర్మిస్తోంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం బిలాస్‌పూర్ గ్రామానికి చెందిన అన్సూర్ రెహమాన్ బేల్దారి పని చేస్తూ కాలుజారి భవనం నుంచి కిండిపడిపోయాడు.అక్కడున్న సిబ్బంది చికిత్స నిమిత్తం రూయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కార్మికుడు మృతిచెందిన భవనాన్ని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి,రాధాకృష్ణ పరిశీలించారు.భవన యాజమాన్యంతో మాట్లాడి మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారంతోపాటు మృతదేహాన్ని సొంత ఊరికి పంపించేందుకు ఖర్చులు భరించేందుకు అంగీకరింపజేశారు.

వేనాడు దర్గాలో గంధోత్సవం ప్రారంభం


దర్గాలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తజనం

తడ/సూళ్లూరుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాతిగాంచిన వేనాడు షేక్ దావూద్ షా వలీ అల్లాతాత దర్గా గంధోత్సవం శనివారం అట్టహాసంగా మొదలైంది. 630 ఏళ్ల చరిత్ర కలిగి 144 అడుగుల పొడవు కలిగిన వేనాడు దర్గా గంధోత్సవానికి నిర్వాహకులు భారీగా ఏర్పాట్లు చేశారు. మన ప్రాంతం నుంచేగాక పొరుగు రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పలువురు టీడీపీ నాయకులు గంధోత్సవ ప్రారంభంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యేకు దర్గా నిర్వాహకులు సుదర్శన్ రావు, మజార్లు స్వాగతం పలికి, ఆశీర్వచనం చేశారు. దర్గా ప్రాంగణమంతా విద్యుద్దీప కాంతులతో విరాజిల్లింది. ఉర్దూ ఖవ్వాలి, పకీర్ల విన్యాసాల నడుమ తరలివచ్చిన భక్తులు బాబా ఆశీస్సులు పొందారు. దర్గా ఆవరణలో సీసీ కెమెరాలతో పాటు ఎల్‌ఈడీ స్రీన్ ఏర్పాటు చేశారు. రాత్రి 10 గంటల వరకు భక్తులతో దర్గా ప్రాంగణమంతా కిటకిటలాడింది. అర్ధరాత్రి దాటాక గ్రామ పొలిమేరలో ఉన్న పీర్లచావడి వద్ద ముస్లిం మతపెద్దలు ప్రత్యేక పూజలు చేసి, గంధాన్ని గుమటంపై గ్రామంలో ఊరేగిస్తారు. అనంతరం గంధాన్ని గ్రామ నిర్వాహకుల చేతుల మీదుగా తీసుకెళ్లి దర్గా సమాధి వద్ద లేపనం చేసినానంతరం భక్తులకు పంచిపెడతారు. గంధోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో సూళ్లూరుపేట ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో 10మంది ఎస్ఐలు, ఇద్దరు సీఐలు, 120 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చూశారు.


విద్యుత్ వెలుగుల్లో దర్గా ప్రాంగణం

అధునాతన పద్ధతులతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స



- బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ మెకాలి మార్పిడి శస్త్ర చికిత్స అవసరమవుతోందని,ఆధునిక వైద్య పద్ధతుల ద్వారా ఎలాంటి భయాందోళన లేకుండా చేసుకోవచ్చునని బర్డ్ డైరెక్టర్ గుడారు జగదీష్ అన్నారు. పుదుచ్చేరిలోని మహాత్మా గాంధీ వైద్య కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న దక్షిణాది రాష్ట్రాల ఆర్థోపెడిక్ అసోసియేషన్ 24వ వార్షిక సమావేశానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 21 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు వారిలోనూ మోకాలి కీళ్ల సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. ఆర్థోపెడిక్ రంగంలో వచ్చిన అధునాతన వైద్య పద్ధతులతో భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందీ లేకుండా మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు చేయవచ్చన్నారు. ఇటువంటి శస్త్ర చికిత్సలు విజయవంతం కావడంలో వైద్యుడి నైపుణ్యం, ఆపరేషన్ సమయంలో తీసుకునే జాగ్రత్తలు, నాణ్యమైన ఇంప్లాంట్లు ఎంపిక చేసుకోవడం ప్రధానమన్నారు. అనంతరం ఆయన ఆర్థోపెడిక్ రంగంలో తాజా ఆవిష్కరణలు, నూతన చికిత్స పద్ధతులు, అధునాతన శస్త్ర చికిత్సా సాంకేతికత గురించి వివరించారు. యువ వైద్యులకు ఆయన అనుభవాలను, పరిశోధనలను గురించి వివరించారు. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్లు, పరిశోధకులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైర్మెంటు ముందు రోజు టీటీడీ అధికారి మృతి

- కుటుంబ సభ్యులను విచారిస్తున్న పోలీసులు?


మృతి చెందిన సుబ్బరాజు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): టీటీడీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి కోనేటి సుబ్బరాజు(62) ఉద్యోగ విరమణకు ఒక రోజు ముందు (శనివారం) మృతిచెందారు. ఆయన సతీమణి వెంకటసరస్వతి, అలిపిరి సీఐ రాంకిశోర్‌ల కథనం మేరకు.. తిరుపతి కేటీ రోడ్డులోని కేటీ క్వార్టర్సులో ఉంటున్న సుబ్బరాజు కపిలతీర్థం ఆలయంలో ఏఈవోగా పనిచేస్తున్నారు. ఆయన ఆదివారం రిటైర్ కావాల్సి ఉంది. భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు సునీల్‌కుమార్ టీటీడీలో అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి సుబ్బరాజు కుటుంబ సభ్యులతో కలసి సినిమాకు వెళ్లారు. అక్కడ తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో ఆయనను స్విమ్స్‌లో చేర్పించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. వెంటనే కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదు. భార్య వెంకట సరస్వతి శనివారం ఉదయం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అలిపిరి ఎస్ఐ అజిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ చెప్పారు. కాగా ఈ కేసులో కొంతమంది కుటుంబ సభ్యులను పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ఆయన మృతి వెనుక మరేదైనా కోణం ఉందా అనే దిశగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. మృతుడి మెడపై గాయం ఉన్నట్లు పోలీసులు చెప్పినట్లు సమాచారం.

పీఏసీ5లో 2,500 మందికి వసతి

- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



తిరుమల, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నూతనంగా నిర్మించిన యాత్రికుల వసతి సముదాయం-5(పీఏసీ) ద్వారా 2,500 మంది భక్తులకు బస కల్పించవచ్చని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఆయన శనివారం పీఏసీ5 భవనంలోని హాళ్లు, కల్యాణకట్ట, మరుగుదొడ్లు, అన్నప్రసాద వితరణ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2018లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బోర్డు ఆమోదం తెలిపిన ఈ ప్రాజెక్ట్ ద్వారా తిరుమలలో యాత్రికుల వసతి సమస్యకు కొంతమేర ఉపశమనం కలుగుతుందన్నారు. ప్రస్తుతం తిరుమలలో 45 వేల మందికి మాత్రమే వసతి సౌకర్యాలు ఉన్నాయని, ఈ భవనం ద్వారా 2,500 మందికి అదనంగా బస లభిస్తుందని అన్నారు. వెంకయ్య చౌదరి మాట్లాడుతూ యాత్రికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ భవనంలో ఆధునిక సదుపాయాలు కల్పించామన్నారు. చంటి పిల్లల తల్లుల కోసం ప్రత్యేకంగా మిల్క్ ఫీడింగ్ గది ఏర్పాటు చేశామన్నారు. ఒకేసారి 1400 మంది అన్నప్రసాదాలు స్వీకరించేలా హాలును ఏర్పాటు చేసినట్టు వివరించారు. ప్రథమ చికిత్స కేంద్రం అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ, ఈఈ వేణుగోపాల్, డిప్యూటీ ఈవో రాజేంద్ర పాల్గొన్నారు.



హంద్రీ-నీవా కాలువ ఒడ్డుపై చంద్రబాబు నడక

వచ్చే ఏడాది చిత్తూరుకు కృష్ణా జలాలు

సీఎం చంద్రబాబు

కుప్పం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది చిత్తూరుకు కృష్ణా జలాలను తీసుకువస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా ప్రజలకు హామీ ఇచ్చారు. కుప్పం దాకా ప్రస్తుతం హంద్రీ-నీవా కాలువను తీసుకు వచ్చామని, వచ్చే ఏడాది ఇదేరకంగా చిత్తూరుకు కాలువలను నిర్మిస్తామని, అందుకోసం ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేయమని అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు.కుప్పంలో కృష్ణా జలాలకు హారతి ఇచ్చిన ఆయన గంగమ్మకు నమస్కరించి, పసుపు కుంకుమ, పూలతో పూజించారు. అనంతరం హంద్రీ-నీవా కుప్పం ఉప కాలువ నిర్మాణం పూర్తయిందన్న గుర్తుగా కాలువ ఒడ్డున నిర్మించిన పైలాన్‌ను ఆవిష్కరించారు. అక్కడే జలవనరుల శాఖ ఏర్పాటు చేసిన హంద్రీ-నీవా కాలువ నిర్మాణానికి సంబంధించిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం పరమసముద్రం చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన సభావేదికకు చేరుకుని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.కుప్పంనుంచి వరుసగా 8 సార్లు ఎమ్మెల్యేగా తనను గెలిపించిన జనం అభిమానం నిలబెట్టుకోవడానికి కృతజ్ఞతాపూర్వకంగా హంద్రీ-నీవా కాలువ నిర్మాణం పూర్తి చేసి కృష్ణా జలాలను మీ ముంగిటిదాకా తీసుకువచ్చానని చెప్పారు.ప్రస్తుతం తరలివస్తున్న కృష్ణా జలాలతో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో 110చెరువులు నింపుతామన్నారు. కుప్పం నియోజకవర్గంలోని 520 చెరువులకు నీళ్లిస్తామని, గొలుసుకట్టు చెరువులు ఉన్నాయని, లేనిచోట చెక్ డ్యాముల ద్వారా నీటిని నిలువ ఉంచుతామన్నారు. పాలారు నదిమీద చెక్ డ్యాములు మరమ్మతులు చేయడమే కాక, కొత్త చెక్ డ్యాములు నిర్మిస్తామని, అన్ని చెరువులకు అంచనాలు తయారు చేసి పూడికతీత, మరమ్మతు పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ పనులన్నీ ఏడాదిలో పూర్తయ్యేలా ప్రణాళిక రచిస్తున్నామన్నారు. అయితే వరి వేసి నష్టపోవద్దని, వాణిజ్య పంటలు సాగు చేసి లాభాలు గడించాలని పిలుపునిచ్చారు. మెగా డీఎస్సీలో నెగ్గి కుప్పంలో ఏకంగా 52 మంది టీచర్లు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. దీనివల్ల ఇక్కడి పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడకుండా చదువులు చక్కగా సాగుతాయని చెప్పారు. కుప్పంలో కడా ద్వారా 12 ప్రాజెక్టులు వచ్చాయని, వీటి ద్వారా ప్రత్యక్షంగా 15600 మందికి, పరోక్షంగా 26,500 మందికి ఉద్యోగ, ఉపాధి అకాశాలు లభించాయన్నారు. ప్రత్యేకంగా నిర్మించనున్న అంతర్రాష్ట్ర రహదారుల ద్వారా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ప్రధాన నగరాలకు మరింత దగ్గరి మార్గాలు ఏర్పడుతాయని చెప్పారు. డిసెంబరులో విమానాశ్రయ నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. తాను ఎన్నోసార్లు చెప్పినట్లు రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే ప్రాజెక్టులన్నింటినీ ముందుగా కుప్పానికి తీసుకు వచ్చి కుప్పం నియోజకవర్గాన్ని ఒక ప్రయోగశాలగా చేస్తానని చంద్రబాబు తెలిపారు.

ఆరు కంపెనీలతో కడా ఎంవోయూలు

శాంతిపురం/గుడుపల్లె/కుప్పం రూరల్,ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు తన కుప్పం పర్యటనలో కడా ద్వారా ఆరు కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. కుప్పం పరిధిలో చెత్తనుంచి సంపద తయారు చేసేందుకు ఏజీఎస్(అకాడమీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్)- ఐటీసీ, మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు షీలీడ్స్, ఫైబర్ బోర్డు ఉత్పత్తికోసం కింగ్స్ వుడ్ డెకార్ ప్రైవేట్ లిమిటెడ్, 2 సీటర్ ట్రైనింగ్ ఎయిర్ క్రాఫ్ట్ తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు పయనీర్ క్లీన్ యాంప్స్ లిమిటెడ్, మీడియం లిఫ్ట్ లాంచింగ్ రాకెట్ రేజర్ క్రెస్ట్ ఎంకే-1 తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం స్పేస్ టెక్నాలజీ సంస్థ ఎత్రెయాల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ హబ్ ఏర్పాటుకు రెడ్ బెర్రీ ఫుడ్ లాజిక్స్ కంపెనీలతో ఒప్పందాలు కుదిరాయి. మొత్తం ఈ సంవత్సర కాలంలో రూ.3920 కోట్ల పెట్టుబడితో 12 పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా 15600 మందికి, పరోక్షంగా 26,500 మందికి ఉద్యోగ, ఉపాధి లభించనుంది.



ఎంవోయూ పత్రాలతో చంద్రబాబు, ఏజీఎస్ - ఐటీసీ ప్రతినిధులు

కుప్పంలోఐ ఫోన్ ఛాసిస్ తయారీ కేంద్రం

కుప్పంలో హిందాల్కో అంతర్జాతీయ కంపెనీ రూ.587 కోట్ల పెట్టుబడితో ఐ ఫోన్ ఛాసిస్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. దీని ద్వారా కొన్ని వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

లబ్ధిదారులతో బస్సు ప్రయాణం



స్వగృహం నుంచి సభా ప్రాంగణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. వివిధ పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతూ ఆయనే ప్రయాణం చేశారు. వారికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించడమే కాక, ఆయా పథకాల వల్ల వారు పొందుతున్న లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. రైతులతో హంద్రీ-నీవా నది ద్వారా తరలివచ్చిన కృష్ణమ్మ గురించి అడిగినప్పుడు వారి మాటల్లో, ముఖంలో కనిపించిన ఆనందం చూసి ఆయన ఉత్తేజితులయ్యారు.

ఆరుగురు పిల్లల తల్లికి రూ.78 వేలు

బహిరంగ సభా వేదికమీద రావడానికి చాలా సమయం ముందే ఇద్దరు మహిళలను ఆశీనులను చేశారు. చంద్రబాబు వేదిక మీదకు వచ్చి ప్రసంగం మధ్యలో ఆ మహిళల గురించిన వివరాలు తెలిపారు. సబీనా అనే ఆరుగురు పిల్లలు కలిగిన తల్లికి 'తల్లికి వందనం' పథకం ద్వారా ఏకంగా రూ.78 వేలు లబ్ధి చేకూరిందన్నారు. ఇద్దరు పిల్లల తల్లియైన దీపాలక్ష్మికి రూ.26 వేలు లబ్ధి చేకూరిందన్నారు.అంతేకాక ఆమె అత్తకు పింఛనుతోపాటు ఇంకా పలురకాల ప్రభుత్వ పథకాల వల్ల లబ్ధి చేకూరుతున్నదని చెప్పారు.

గణనాథుడి సేవలో

స్వగృహంనుంచి సభా ప్రాంగణానికి బయలుదేరిన చంద్రబాబు మార్గమధ్యంలోని కుప్పం ప్యాలెస్ రోడ్డులో యువ టీడీపీ నాయకుడు హర్షధర్మ తేజ, అతని మిత్రులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని దర్శించి పూజలు చేశారు. రావణబ్రహ్మ అవతారంలో ఉన్న వినాయక ప్రతిమ రూపాన్ని చూసి యువతను మెచ్చుకున్నారు.

రింగ్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు

కుప్పం-హోసూరు-బెంగళూరు రింగ్ రోడ్డు నిర్మాణానికి రంగం సిద్ధమైందని సీఎం చెప్పారు. కుప్పం వయా కేజీఎఫ్ లింక్ రోడ్డు నిర్మాణం కూడా త్వరలోనే జరుగుతుందన్నారు.

మళ్లీ యాక్టివ్‌గా డీకే కుటుంబం

చంద్రబాబును కలిసిన డీఏ శ్రీనివాస్, బద్రి

చిత్తూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రాజకీయాల్లో ఒకప్పుడు కీలక పాత్ర పోషించిన డీకే కుటుంబం రాజకీయంగా మళ్లీ యాక్టివ్ కానుంది.మాజీ ఎంపీ డీకే ఆదికేశవులు తమ్ముడు బద్రినారాయణ శనివారం కుప్పంలోని సీఎం నివాసంలో చంద్రబాబును కలిశారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పరిచయం చేయగా, 'నాకు తెలుసు.. ఎన్ని అవకాశాలు ఇచ్చినా ఎన్నికల సమయంలో దూరంగా ఉన్నారు కదా' అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న డీకే ఆదికేశవులు కుమారుడు డీఏ శ్రీనివాస్ తిరుగు ప్రయాణంలో సీఎంను బెంగుళూరు ఎయిర్‌పోర్టులో కలిశారు. 'నేను రాజకీయంగా మళ్లీ యాక్టివ్ అవుతాను. టీడీపీ కార్యక్రమాల్లో పాల్గొంటాను. అప్పట్లో కేసుల కారణంగా దూరంగా ఉండాల్సి వచ్చింది' అని చంద్రబాబుతో చెప్పుకున్నారు. ఈ లెక్కన మళ్లీ ఆ కుటుంబం చిత్తూరు రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది.నిజానికి ఎన్నికల సమయంలో డీకే కుటుంబం ముందుకొస్తే చిత్తూరు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు ఆసక్తి చూపించారు.అయితే పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డిలను డీఏ శ్రీనివాస్ కలవడం..ఆదికేశవులు మనవరాలు చైతన్య జనసేనలో చేరి చిత్తూరు ఇన్‌ఛార్జిగా చెప్పుకోవడంతో అసలు ఆ కుటుంబానికి ఆసక్తి ఉందా అనే సందేహం కలిగింది. చివరకు గురజాల జగన్మోహన్ టికెట్ తెచ్చుకుని ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.

కృష్ణా జలాలతో సీమ కరువు తీరింది

మంత్రి నిమ్మల

శాంతిపురం/గుడుపల్లె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని 4 జిల్లాలు, 19 నియోజకవర్గాలు, 88 మండలాలను కలుపుతూ హంద్రీనీవా కాలువ ద్వారా ప్రవహించి వస్తున్న కృష్ణా జలాలతో రాయలసీమ కరువు తీరిందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. కుప్పంలో కృష్ణా జలాలకు హారతి ఇచ్చిన సందర్భంగా శనివారం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావంనుంచి కరువు ప్రాంతమైన రాయలసీమను రతనాల సీమగా మార్చాలని నాటి నందమూరి తారకరామారావు నుంచి నేటి చంద్రబాబు దాకా సాగిన ప్రయత్నాలు ఫలించాయన్నారు. గత పాలకులు అయిదేళ్ల పాలనలో ఏనాడూ ప్రాజెక్టుల కోసం తట్ట మట్టి కూడా వేయలేదని విమర్శించారు. వారి విధ్వంసక పాలనలో పోలవరం డయాఫ్రమ్ వాల్ ధ్వంసమైందని, అన్నమయ్య పులిచింతల గేటు కొట్టుకుపోయిందని గుర్తు చేశారు. కనీసం హంద్రీనీవా కరెంటు బిల్లులను సైతం కట్టలేని దౌర్భాగ్య స్థితిలో గత ప్రభుత్వం ఉండిపోయిందని ధ్వజమెత్తారు.ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమంకోసం, కుప్పాన్ని సస్యశ్యామలం చేయడంకోసం భగీరథుని మించిన ప్రయత్నం ముఖ్యమంత్రి చంద్రబాబు చేశారన్నారు.చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ కృష్ణమ్మను కుప్పం చేర్చిన చంద్రబాబును భవిష్యత్తరాలు ఎప్పటికీ మర్చిపోవన్నారు.ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, రెస్కో చైర్మన్ ప్రతాప్, కుప్పం వ్యవసాయ మార్కెట్టు కమిటీ చైర్మన్ జి.మునిరాజు, టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, శాంతిపురం, గుడుపల్లె మండల పార్టీ అధ్యక్షులు విశ్వనాథనాయుడు, బాబునాయుడు, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు రాజేశ్, రిత్విక్, నాగరాజ నాయుడు పాల్గొన్నారు.



ద్విచక్రవాహనంపై మంత్రి నిమ్మల

కుప్పం రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ద్విచక్ర వాహనంపై సామాన్యునిలా ప్రయాణించి తన ప్రత్యేకత నిరూపించుకున్నారు. జలహారతి ప్రాంతంనుంచి సభా ప్రాంగణానికి పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబుతో కలిసి తానే స్వయంగా నడుపుకుంటూ కూర్చుని వెళ్లడం ప్రజలను ఆకర్షించింది.

బాబు అసెంబ్లీ ప్రసంగం ప్రదర్శన

కుప్పం రూరల్,ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ హయాంలో నాటి నేతలు చేసిన అరాచకాన్ని, అంతకుముందు, మళ్లీ ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని గురించి చంద్రబాబు సభలో ప్రస్తావించారు. ప్రత్యేకించి కృష్ణా జలాల గురించి 2016లో అసెంబ్లీలో ముఖ్యమంత్రిగా తాను చేసిన ప్రసంగాన్ని వీడియో రూపంలో సభా వేదికపైనే ప్రదర్శించారు. అందులో ప్రతిపక్షమైన వైసీపీ నేతలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 'మీ నాయకుడు వద్దన్నా పులివెందులకు నీళ్లిస్తా. మీ పలమనేరు, పుంగనూరు, మదనపల్లె ఎమ్మెల్యేలు ఇక్కడే ఉన్నారు, వారి నియోజకవర్గాలకు కూడా వారు అడ్డుపడినా నీళ్లిస్తా. నా నియోజకవర్గమైన కుప్పానికి కచ్చితంగా నీళ్లను తీసుకు వెళ్తా.' అని చెప్పడం కనిపించి, వినిపించింది. అప్పుడు చెప్పిన మాటలను పట్టువదలకుండా కృషి చేసి ఇప్పుడు సాధించానని ఆయన ప్రజలకు వివరించారు.



హంద్రీనీవా ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న చంద్రబాబు



దాత అన్వేష్‌కు రసీదు అందిస్తున్న ఈవో పెంచలకిషోర్ - ఆర్టీఐ కమిషనర్ సునీల్‌కు జ్ఞాపికను అందిస్తున్న డీఈవో సాగర్‌బాబు

వరసిద్ధుడి అన్నదానానికి రూ.25లక్షల విరాళం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి విజయవాడకు చెందిన గుమ్మడి అన్వేష్ శనివారం రూ.25లక్షలను విరాళంగా ఇచ్చారు. అన్నదానం ప్రారంభించినప్పటి నుంచి ఈ స్థాయిలో విరాళం అందడం ఆలయానికి ఇదే ప్రథమం. కాగా ఏపీ ఆర్టీఐ కమిషనర్ చావలి సునీల్ వరసిద్ధుడిని శనివారం సాయంత్రం దర్శించుకున్నారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

వెదురుకుప్పం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వివాహిత మృతి చెందింది. ఏఎస్ఐ గోవిందస్వామి తెలిపిన వివరాల మేరకు.. కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేటలో నివాసం ఉంటున్న సుమతి(39) శనివారం ఉదయం లైట్ వేయడానికి స్విచ్ ఆన్ చేసింది. లైట్ వెలగకపోవడంతో వైర్లను కదిలిస్తుండగా విద్యుదాఘాతానికి గురైంది. కుటుంబీకులు ఆమెను వెంటనే కార్వేటినగరం సీహెచ్‌సీకి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే మృతి చెందింది. భర్త నాగయ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబీకులకు అప్పగించారు.



సుమతి (ఫైల్ ఫొటో)

బీజేపీ బలోపేతానికి కృషి: అశోకరాజు



విజయపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కృషి చేస్తున్నట్టు రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కొండూరు అశోకరాజు తెలిపారు. శనివారం విజయవాడలోని బీజేపీ సంస్థాగత కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మను మర్యాద పూరకంగా కలిసి సత్కరించారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర నూతన కార్యవర్గంలో చోటు కల్పించడంపై కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉంటానన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషిధ రాజు, నాయకుడు చిట్టిబాబుయాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో కాలపరిమితిని సెప్టెంబరు ఒకటి నుంచి నవంబరు 30వ తేదీవరకు (మూడునెలల పాటు) పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కలెక్టర్, డీఎంసీ చైర్మన్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ-కోర్టు సేవా కేంద్రం ప్రారంభం



సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి అరుణ సారిక

చిత్తూరు లీగల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ-కోర్టు సేవా కేంద్రాన్ని జిల్లా జడ్జి అరుణ సారిక శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ కేంద్రంలో కక్షిదారులు తమ కేసుల వాయిదా ఎప్పుడుందో తెలుసుకునే అవకాశం ఉందన్నారు. న్యాయవాదులు కూడా తమ కేసుల స్థితిని తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శంకర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎస్పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎల్ఎల్‌బీ పరీక్షలు రాసే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని ప్రిన్సిపాల్ మనోహర్ తెలిపారు. శుక్రవారం 'ఆ పరీక్ష కేంద్రంలో మౌలిక వసతుల్లేవ్..!' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై స్పందించారు. మహిళా కళాశాల నేపథ్యంలో పురుషులు, మహిళలకు విడివిడిగా వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఒక డెస్కులో ఒక విద్యార్థిని మాత్రమే అనుమతించి, నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

వరి, అరటి తోటలపై ఏనుగుల దాడి

పలమనేరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలం బయప్పగారిపల్లి పంచాయితీ ఊసరపెంట గ్రామ సమీపంలోని వరి, అరటి తోటలపై ఏనుగులు దాడి చేసి పంటలను ధ్వంసం చేశాయి. శుక్రవారం రాత్రి బాబునాయుడుకు అర్ధ ఎకరంలో సాగుచేసిన వరి పంటతో పాటు అరటి చెట్లను ఏనుగులు దాడిచేసి తీవ్రంగా నష్టపరిచాయి. మహేశ్వరికి చెందిన ఎకరా వరి పంటను ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. అరుణాచలానికి చెందిన కోత దశలో ఉన్న టమోటా పంటపై ఏనుగులు దాడిచేసి ధ్వంసం చేశాయి. తమ పంట పొలాల చుట్టూ సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు చేసుకొనేందుకు తమకు ఇకనైనా ప్రభుత్వం వంద శాతం సబ్సిడీ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.



నూనేవారిపల్లి సమీపంలో ఏనుగులు తొక్కేసిన వరి పంట

టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడిగా రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డిని మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుపతిలోని సంఘం కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. తొలుత ఇప్పటి వరకు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు, సాధించిన విజయాల గురించి అధ్యక్షులు వివరించారు. భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీపై జరిగిన చర్చలో మరోమారు ప్రభాకర్‌రెడ్డిని అధ్యక్షుడిగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎస్.వేణుగోపాల్, కోశాధికారి టి.దాసు, జి.గోవిందరెడ్డి, చిన్నంగారి రమణ, జి.సుబ్రమణ్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ, కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ల రద్దు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వరదల నేపథ్యంలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను శనివారం, కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను ఆదివారం రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో శనివారం ఉదయం నుంచి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి-కాచిగూడ మధ్య ప్రత్యేక రైలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

తిరుప్పావై ఉపన్యాసాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుమల, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది డిసెంబరు 16 నుంచి 2026 జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాసంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో తిరుప్పావై ఉపన్యాసాలిచ్చేందుకు వైష్ణవ సిద్ధాంతం తెలిసిన పండితుల నుంచి దరఖాస్తులు, అంగీకర పత్రాలను టీటీడీ ఆహ్వానిస్తోంది. ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏటా ధనుర్మాసంలో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అర్హులైనవారు సోమవారం నుంచి సెప్టెంబరు 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు 'ప్రత్యేకాధికారి, ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్, శ్వేతాభవనం, టీటీడీ, తిరుపతి' అనే చిరునామాకు దరఖాస్తులు, అంగీకర పత్రాలు పంపాల్సి ఉంటుంది. అంగీకార పత్రాలు ఇచ్చే పండితుల పట్టికతో వివరాలను, దరఖాస్తులను టీటీడీ.తిరుమల.ఓఆర్జీ అనే వెబ్‌సైట్ నుంచి పొందచ్చని టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది.

4న ఎస్వీయూలో టీచర్స్‌డే సంబరాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): టీచర్స్ డే సంబరాలు సెప్టెంబరు 4వ తేదీన ఎస్వీయూనివర్సిటీలో నిర్వహించనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందులో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, వర్సిటీ కాలేజీ ప్రిన్సిపాళ్ళు పాల్గొంటారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

యూనివర్సల్ విద్యార్థికి జిల్లా చాంపియన్‌షిప్



నిధిశ్రీని సన్మానిస్తున్న సామాజిక సేవా కార్యకర్తలు

గంగవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక యూనివర్సల్ పాఠశాలకు చెందిన నిధిశ్రీ ఉమ్మడి జిల్లా స్థాయి చాంపియన్‌షిప్ సాధించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. 29న తిరుపతిలోని కేవీఎన్ గ్రౌండ్స్‌లో జరిగిన అండర్ 14 విభాగం లాంగ్‌జంప్, రన్నింగ్ లతోపాటు పలు విభాగాల్లో నిధిశ్రీ తలపడింది. ఈ పోటీల్లో లాంగ్‌జంప్ 2.95 మీటర్లు, రన్నింగ్ 60 మీటర్లు 9.95 సెకన్లు, షాట్‌పుట్ బ్యాక్‌త్రో 12 మీటర్లు చొప్పున ప్రతిభ చూపి మూడు విభాగాల్లో జిల్లాస్థాయిలో రెండో స్థానం దక్కించుకొంది. దీంతో నిర్వాహకులు నిధిశ్రీకి చాంపియన్‌షిప్ మెడల్ అందించి అభినందించారు. అలాగే నిధిశ్రీని పలమనేరుకు చెందిన సామాజిక సేవాకార్యకర్త మధుమోహన్, మిత్ర బృందం సన్మానించి అభినందించారు.

లబ్ధిదారులందరికీ స్మార్ట్ రేషన్‌కార్డులు



స్మార్టు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్, టీడీపీ నాయకులు

సోమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా అందజేసిన స్మార్టు రేషన్‌కార్డులను 37 రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్ సూచించారు. శనివారం కందూరు చౌకదుకాణంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, సోమలలో సింగిల్‌విండో అధ్యక్షుడు శివశంకర్, ఇరికిపెంటలో ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు లబ్ధిదారులకు స్మార్టు రేషన్‌కార్డు లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సుబ్బరాయుడు, గల్లా బోస్, విశ్వనాథం, రమేశ్‌నాయుడు, శ్రీనివాసులు నాయుడు, ఉమాపతి నాయుడు, మునిచంద్ర, వేణుగోపాల్ నాయుడు డీలర్లు పాల్గొన్నారు.

నేడు రామకుప్పంలో క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

రామకుప్పం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మీకాంత్ తెలిపారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించే ఈ శిబిరంలో క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా, ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు జరిగే ఈ శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వెంకటరమణకు సన్మానం



కార్యదర్శి వెంకటరమణను సన్మానిస్తున్న మండల అధికారులు

సోమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నెల్లిమంద పంచాయతీ కార్యదర్శి పసుపులేటి వెంకటరమణ పదవీ విరమణ కావడంతో మండలాధికారులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఆయన ఉత్తమ సేవలను అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణ, డిప్యూటీ ఎంపీడీవో లక్ష్మీదేవి, ఏపీఎం షౌకత్, ఏపీవో శివ, పంచాయతీ కార్యదర్శులు జయశంకర్, మణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

చౌడేపల్లె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పార్వతి పేర్కొన్నారు. శనివారం ఆమె మండలంలోని బాలసముద్రంలో ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రదీప్‌రాజు, వీఆర్వో మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం పుంగనూరు మండలంలో జరిగింది. వివరాలిలా.. మండలంలోని నెక్కుంది పంచాయతీ చిన్న అలసాపురానికి చెందిన నారాయణరెడ్డి పశువులను పొలాల వద్దకు తీసుకెళ్లి మేతకు వదిలాడు. పొలాలను నాశనం చేస్తున్న అడవిపందుల కోసం తీసిన విద్యుత్ తీగలను గమనించకపోవడంతో కాలుకు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. గుర్తించిన చుట్టు పక్కల పొలాల రైతులు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో అతడిని చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్ల సూచనల మేరకు తిరుపతికి తరలించినట్లు సమాచారం.

రేపటి నుంచి ఇంటింటికీ స్మార్ట్ రేషన్‌కార్డులు

కల్లూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో సోమవారం నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు జయసింహ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 32 చౌకదుకాణాలకు సంబంధించి కొత్త రేషన్ కార్డులతో కలిపి 12,551 కార్డులు మండలానికి చేరుకున్నాయి. క్లస్టర్ల వారీగా ఇప్పటికే సచివాలయ సిబ్బంది మ్యాపింగ్ చేయడం జరిగింది. 5వ తేదీ వరకు సచివాలయ సిబ్బంది ఇంటింటికెళ్లి లబ్ధిదారులకు అందజేస్తారు. చౌకదుకాణాల్లో డీలర్లు ఇస్తారని తహసీల్దార్ తెలిపారు.

పుంగనూరులో
కుక్కల బెడదను నివారించాలి
- మున్సిపల్ మీట్‌లో సభ్యుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా

పుంగనూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో అధికంగా ఉన్న కుక్కలు, దోమల బెడద నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో జరిగిన మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు పూల త్యాగరాజు, కదీరున్నిషా మాట్లాడుతూ వీధుల్లో కుక్కలు అధికంగా ఉండటంతో పిల్లలు పాఠశాలకు వెళ్లే పరిస్థితి లేదని, పిల్లలు, ప్రజలు వీధుల్లోకి వస్తే వారిపై దాడి చేసి గాయపరుస్తున్నట్లు ఆరోపించారు. దోమలు పగటిపూటా ఇళ్లలో, వీధుల్లో అధికంగా ఉండటంతో దోమకాటుతో ప్రజలు అనారోగ్యం పాలవుతారని, నివారణకు కాల్వలు శుభ్రం చేయిస్తూ ఫాగింగ్ చేయాలని కోరారు. అలాగే ప్రతి నెలా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించి ప్రజా సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం మూడు నెలలకు ఒక్కసారి సమావేశాలు నిర్వహించడం సరికాదన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్లు నాగేంద్ర, లలిత, మున్సిపల్ డీఈఈ మహేశ్, ఇతర అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ప్రథమ ప్రాధాన్యత



మాట్లాడుతున్న తహసీల్దార్ మధుసూదన్

సోమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పరమైన అభివృద్ధి కార్యక్రమాల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తుందని తహసీల్దార్ మధుసూదన్ పేర్కొన్నారు. శనివారం ఊర మాదిగపల్లెలో జరిగిన పౌరహక్కుల దినోత్సవ గ్రామసభలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగానే రేషన్‌కార్డులు, దారి సమస్యలు, వీధి దీపాలు వెలగడంలేదని, మురుగునీటి కాలువల దుస్థితిపై అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో ఆర్ఐ సుబుక్తుల్లా, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, వీఆర్వో సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

చౌడేపల్లె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలసముద్రం, చౌడేపల్లె, బత్తలాపురం తదితర చౌకదుకాణాల్లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అందరికి బయోమెట్రిక్ ద్వారా స్మార్ట్ కార్డులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రదీప్‌రాజు, కల్యాణ్, నారాయణరాజు, కుమార్‌రెడ్డి, చంద్రమౌళి, తహసీల్దార్ పార్వతి పంపిణీ చేశారు.

లక్ష్మీపతిరాజు జన్మదిన వేడుకలు



బస్టాండులో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

చౌడేపల్లె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు మాదిరాజు లక్ష్మీపతిరాజు జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక బస్టాండులో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అలాగే అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ఛైర్మన్ పగడాల హరిప్రసాద్, టీడీపీ నాయకులు నారాయణరాజు, కార్తీక్, సాగర్, సుధాకర్‌నాయుడు, శివప్ప, నాగభూషణాచారి, గణేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా
సచివాలయ భవనం

- తేలికపాటి వర్షానికే ఉరుస్తున్న గది
- తడిసి ముద్దవుతున్న రికార్డులు, కంప్యూటర్లు

పెద్దపంజాణి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయ భవనంలోకి బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పెచ్చులూడుతున్న భవనంలోకి ప్రవేశించాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు భయపడుతున్నారు. విధులు నిర్వహిస్తున్న సమయంలో పలుమార్లు పెచ్చులూడి పడటంతో సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. తేలిక పాటి జల్లులకే ఉరుస్తుండటంతో అత్యంత విలువైన రికార్డులు, కంప్యూటర్లు తడిసి ముద్దవుతున్నా పట్టించుకునేవారు లేరని సచివాలయ సిబ్బంది పేర్కొంటున్నారు. అయితే మండల కేంద్రంలో దాదాపు రూ.20 లక్షలతో నూతన భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. విద్యుత్, మరుగు దొడ్ల పనులు మాత్రం పెండింగులో ఉన్నాయి. ఈ పనులను పూర్తి చేస్తే నూతన భవనంలో విధులు నిర్వహించకోవచ్చు. ఈ పనులు పూర్తి చేయడానికి కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకపోవడంతో ఈ భవనంలోని పెండింగ్ పనులను ఆపేశాడు. సంబంధిత అధికారులు సైతం ఆ కాంట్రాక్టరుకు తొత్తులుగా మారడంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు సైతం దీనిపై దృష్టి సారించకపోవడం బా దాకరమని.. ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.



అడుగడుగునా కృష్ణమ్మకు హారతులు



రామకుప్పం మండలం కిలాకిపోడు వద్ద జలహారతి కార్యక్రమంలో టీడీపీ నేతలు



రాజుపేట వద్ద జలహారతికి హాజరైన జనసందోహం

రామకుప్పం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువ ద్వారా కుప్పం పరమసముద్రంకు కృష్ణాజలాలు చేరుకున్న సందర్భంగా సీఎం చంద్రబాబు జలహారతి పట్టడానికి సంఘీభావంగా రామకుప్పం మండలంలో పలు చోట్ల టీడీపీ శ్రేణులు, ప్రజలు కృష్ణమ్మకు జలహారతులు పట్టారు. రాజుపేటలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహులు , మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, కిలాకిపోడులో పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రి నారాయణాచారి, సీనియర్ నేత శ్రీనివాసులురెడ్డి, తిమ్మనసముద్రం వద్ద నేతలు పద్మనాభరెడ్డి, మణి, సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వెనుక భాగంలో ఏఎంసీ మాజీ వైస్‌ఛైర్మన్ సీతాపతి, అత్తికుప్పంలో యూనిట్ ఇన్‌చార్జి రామలింగారెడ్డి, ఎంపీటీసీ అరుణ, పంచాయతీ అధ్యక్షుడు మంజునాథరెడ్డిల చెల్దిగానిపల్లె సమీపంలో రెస్కో డైరెక్టరు సురేష్, యువనేత రెడ్డి పురుషోత్తంల ఆధ్వర్యంలో జలహారతులు నిర్వహించారు. కృష్ణమ్మకు పసుపు, కుంకుమలు, పుష్పాలు సమర్పించి జలహారతి ఇచ్చారు. అనంతరం కృష్ణమ్మకు చీర సారెలు సమర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సమైఖ్యాంధ్రప్రదేశ్‌లో చిట్టచివరి ప్రాంతమైన కుప్పం నియోజకవర్గం దశాబ్దాలుగా పాలకుల వివక్షతతో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పూర్తిగా వర్షాధారప్రాంతమైన కుప్పం ప్రజల గోడు ఎవరూ పట్టించుకోలేదన్నారు. కుప్పం నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికైన చంద్రబాబు ఈ ప్రాంతంలో సాగు, తాగునీటి సమస్యలకు చెక్ పెట్టే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. 2024 ఎన్నికల్లో లబ్ధి పొందేందు జగన్ సినిమా సెట్టింగ్ తరహాలో కుప్పానికి కృష్ణా జలాలు ఇచ్చినట్టు బటన్ నొక్కారన్నారు. ఎక్కడికక్కడ పనులు పెండింగ్‌లో ఉండటంతో ఆయన బటన్ నొక్కిన 24గంటలకే కాలువలో నీరు లేక వెలవెలబోయిందన్నారు. 2024లో చంద్రబాబు సీఎంగా కుప్పంలో పర్యటించిన సందర్భంగా ఏడాదిలోపు కుప్పానికి హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణాజలాలను తీసుకొస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీని ఆయన నెరవేర్చారన్నారు. ఈ సందర్భంగా వారు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ, మండల అధ్యక్షులు చలపతి, కొళ్ళపల్లె బాబు, వైస్ఎంపీపీ వెంకట్రామగౌడు, రెస్కో వైస్‌ఛైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో ఛైర్మన్ మహ్మద్‌రఫీ, తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపర భగీరథుడు .. సీఎం చంద్రబాబు



పుంగనూరు వద్ద కృష్ణాజలాలకు హారతి ఇస్తున్న టీడీపీ నాయకులు

పుంగనూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల క్రితం ఇచ్చిన హామీల్లో భాగంగా నికేవలం 13 నెలల్లో హంద్రీనీవా జలాలను కుప్పానికి ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు అపరభగీరథుడని పుంగనూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ నల్లబాల శమిపతి అన్నారు. శనివారం పుంగనూరు పట్టణ శివార్లలోని ప్రసన్నయ్యగారిపల్లె వద్ద హంద్రీనీవా కాల్వలో ప్రవహిస్తున్న కృష్ణాజలాలకు టీడీపీ నేతలతో కలిసి ప్రత్యేక పూజలు చేసి జలహారతి ఇచ్చారు. టీడీపీ మండలాధ్యక్షుడు మాదవరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాయలసీమను రత్నాలసీమగా మార్చడానికి కృష్ణా జలాలు తీసుకొచ్చి రైతుల్లో ఆనందాన్ని చూస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సీవీరెడ్డి, రామకృష్ణమరాజు, మోహన్‌రెడ్డి, ప్రసాద్, గంగాధర్, ఇబ్రహీం, వెంకటరమణారెడ్డి, నౌషాద్, కవిత, సుబ్రహ్మణ్యం, షామీర్, చంద్ర, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ నూతన ధ్వజస్తంభానికి పూజలు



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న అర్చకులు

పుంగనూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన పురాతన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేయనున్న నూతన ధ్వజస్తంభానికి శనివారం ఆలయ అర్చకులు బాల సుబ్రహ్మణ్యం దీక్షితులు, రాము దీక్షితులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిరోజు కావడంతో కొయ్యను ధ్వజస్తంభంగా తయారు చేయడానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. రూ.4 లక్షల అంచనాతో కొయ్య ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఆలయ ఈవో కమలాకర్ సమక్షంలో త్వరలనే కొత్త ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అర్చకులు తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అత్తమామలు మందలించారని ఓ యువతి చెరువులో పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం పంగనూరులో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. పట్టణంలోని దోబీ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం భార్య మల్లీశ్వరి(26)ని అత్తమామలు మందలించడంతో మనస్తాపానికి గురై స్థానిక పుంగమ్మ చెరువు వద్దకు వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని ఆమెను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. సీఐ సుబ్బరాయుడు భర్తను పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతిచెందిన జయచంద్ర

రొంపిచెర్ల ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి- మదనపల్లె హైవేపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జయచంద్ర (36) మృతి చెందాడు. రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లె గ్రామం చల్లావారిపల్లె కు చెందిన జయచంద్ర రోడ్డు దాటుతుండగా పీలేరు వైపు నుంచి తిరుపతి వైపు వెళ్లతున్న కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ చంద్ర కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్షకు పీలేరు ఆస్పత్రికి తరలించారు.

నిప్పంటించుకొన్న మహిళ ..

చౌడేపల్లె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పెద్దయల్లకుంట్లకు చెందిన లేట్ కృష్ణప్ప భార్య క మణి(40) శుక్రవారం సాయంత్రం పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవటంతో కుటింబికులు ఆమెను తిరుపతి రూయ ఆస్పత్రికి తరలించి చికిత్సలు కల్పించారు. అక్కడ ఆమె చికిత్సలు పొందుతూ..మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి తోటి రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైభవంగా గణనాథుడి నిమజ్జనం



రామకుప్పంలో నిమజ్జనానికి తరలుతున్న గణేష్ విగ్రహాలు



కల్లూరు: ఎల్లంకివారిపల్లిలో నిమజ్జనానికి వెళుతున్న గణనాథుడు



కొత్తపల్లెలో లడ్డు వేలంలో పాల్గొన్న యువత

రామకుప్పం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలో ప్రజలు బొజ్జగణపయ్యకు ఘనంగా వీడ్కోలు పలికారు. పట్టణంలో శనివారం గణేష్ విగ్రహాల నిమజ్జనోత్సవం కోలాహలంగా జరిగింది. స్థానిక నాలుగు మాడవీధుల్లో పలు చోట్ల మూడు రోజుల పాటు పూజలందుకున్న వినాయక స్వామి విగ్రహాలను నిర్వాహకులు ఊరేగించారు. భక్తులు అడుగడుగునా స్వామి వార్లకు కర్పూర హారతులిచ్చారు. స్థానిక చెరువుల వద్ద విగ్రహాలకు పూజలు చేసి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

● **కల్లూరు:** పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లిలో శనివారం భక్తిశ్రద్ధలతో గణనాథుడి నిమజ్జనం వేడుకలు నిర్వహించారు. వినాయకుడి మండపంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంపై స్వామివారి ప్రతిమను ఆశీనులు గావించారు. కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనం ముందుకుసాగింది. అనంతరం గ్రామానికి సమీపంలోకి చెరువులో స్వామివారి ప్రతిమను నిమజ్జనం చేశారు. ఎంపీటీసీ సభ్యులు మునికృష్ణమనాయుడు, టీడీపీ నాయకులు గోపినాయుడు, పార్థసారధినాయుడు, పురుషోత్తంనాయుడు, మునిరాజనాయుడు, భాస్కర్‌నాయుడు, మధునాయుడు, కిషోర్‌నాయుడు, తేజనాయుడు పాల్గొన్నారు.

● **రొంపిచెర్ల:** రొంపిచెర్ల మండలం వారణాశివారిపల్లెలో వినాయకచవితి పండుగ సందర్భంగా స్వామి వారి సన్నిధిలో 15 కేజీల లడ్డూను ఉత్సవ కమిటీ వారు ఉంచారు. శనివారం పూజలు నిర్వహించి అనంతరం లడ్డు వేలం నిర్వహించగా రూ.21,116 లకు వారణాశివారిపల్లె గ్రామానికి చెందిన రాజేంద్ర, జి.సురేష్, పెద్దరెడ్డెప్ప, కార్తీక్, చందు కలిసి దక్కించుకున్నారు.. రెడ్డి పుష్పలత, సుభాష్‌చంద్ర దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వినాయకుని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

● **సోమల:** వినాయక చవితి వేడుకల్లో భాగంగా స్వామి బొడ్డులోని నాణెం, లడ్డూలకు నిర్వహించిన వేలంలో భక్తులు పోటీలు పడ్డారు. చిన్నఉప్పరపల్లె పంచాయతీ కమ్మపల్లెలో పంచముఖ వినాయక బంగారు నాణెం రూ.1, 51,000 లకు వేమూరి హరీష్, అష్టలక్ష్మీ వెండి హుండీ రూ. 1,21, 000లకు తోకల త్రిలోక్, లడ్డూను రూ.37 వేలకు తోకల కుమార్‌నాయుడు దక్కించుకున్నారు. వీరిని మాజీ ఎంపీటీసీ రమేశ్ నాయుడు సన్మానించి అభినందించారు. ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు, నీటి సంఘ అధ్యక్షుడు బోస్, కోటీశ్వరరావు పాల్గొన్నారు.



రొంపిచెర్లలో...

● పుంగనూరు రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏతూరు పంచాయతీ కొత్తపల్లె గ్రామంలో వినాయక విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూను అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డి కుమారుడు లోకేశ్వర్‌రెడ్డి రూ. 1.10 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు.

అవినీతి రహిత పాలనే ప్రభుత్వ లక్ష్యం

● స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చారిత్రాత్మక నిర్ణయం
● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్


మహిళకు స్మార్ట్‌రేషన్ కార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత పాలనే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. శనివారం ఇరువారం, జానకారపల్లె చౌక దుకాణాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో స్మార్ట్ రేషన్‌కార్డులను మేయర్ అముదతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ చారిత్రాత్మక నిర్ణయమని చెప్పారు. వైసీపీ హయాంలో రేషన్‌షాపుల్లో అనేక అవినీతి, అక్రమాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ అశోక్, తహసీల్దార్ కులశేఖర్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

నింద్ర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వెలుగు ఏపీఎం పళని అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళ సమాఖ్య పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన పాలకవర్గం ఎంపిక జరిగింది. అధ్యక్షురాలుగా ఇందుమతి, కార్యదర్శిగా సుమతి, కోశాధికారిగా భవాని, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీఎంజీ ఉమాపతి, సీసీలు భాస్కర్, లక్ష్మయ్య, గిరి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచాలి

చిత్తూరు రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీవో 549 ప్రకారం వేతనాలను పెంచాలని ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మణికంఠ డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. అరియర్స్‌ను విడుదల చేసినందుకు అపోలో యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. నాయకులు నాగరాజు, గోపీనాథ్, రమాదేవి, రాజారాం పాల్గొన్నారు.

వైద్య రంగానికి ప్రభుత్వం పెద్ద పీట: భానుప్రకాష్

నింద్ర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ అన్నారు. నింద్రలోని పీహెచ్‌సీలో సుమారు రూ.50 లక్షలతో నిర్మించనున్న పబ్లిక్ హెల్త్ యూనిట్ (ఆస్పత్రి ల్యాబ్) భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఆర్డీవో అనుపమ, తహసీల్దార్ శేషగిరి రావు, ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, నగరి ఏఎంసీ డైరెక్టర్లు నాగభూషణం రాజు, జగన్, నాయకులు భాస్కర్‌రెడ్డి, రవినాయుడు, దశరథవాసు, చిట్టి, బాబునాయుడు, బాబు యాదవ్, శరవణ, పరదేశి, రమేష్, రవికుమార్, కాంట్రాక్టరు ఏబీ రాజు పాల్గొన్నారు.

'రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేని వైసీపీ'


పాతగుంటలో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న చంద్రబాబురెడ్డి

వెదురుకుప్పం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రబాబురెడ్డి మండిపడ్డారు. శనివారం పాతగుంటలో మహిళలతో కలసి సీఎం చంద్రబాబు, రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. మాట్లాడటానికే అర్హత లేని పార్టీ వైసీపీ అన్నారు. నాయకులు అమరనాథ్‌రెడ్డి, లోకనాథరెడ్డి, తిరుపాల్‌రెడ్డి, తిమ్మరాజులు పాల్గొన్నారు.

పీవీకేఎన్‌లో డిజిటల్ లైబ్రరీ క్యాబిన్ ఏర్పాటు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల సహకారంతో పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో డిజిటల్ లైబ్రరీ కేబిన్, పీరియాడికల్ స్టాండ్ ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ జీవనజ్యోతి తెలిపారు. 1969-71 మధ్య చదువుకున్న ఎంపీసీ, బైపీసీ పూర్వ విద్యార్థుల రూ.లక్ష విరాళంలో లైబ్రరీలో ఈ సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు.

అన్నదానానికి రూ.1.25 లక్షల విరాళం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తిరుపతికి చెందిన ఉమాపతిరెడ్డి రూ.1,25,000లను చెక్కు రూపంలో శనివారం రాత్రి విరాళంగా అందించారు. దాతకు స్వామి దర్శన ఏర్పాట్లను ఏఈవో రవీంద్రబాబు చేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణేశుడి ప్రతిమల నిమజ్జనం


కట్టమంచి చెరువులో నిమజ్జనం చేస్తున్న గణేశుడి ప్రతిమ

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి చెరువులో శనివారం కూడా గణేశుడి ప్రతిమల నిమజ్జనం జరిగింది. నాలుగు రోజుల్లో 15 భారీ ప్రతిమలను నిమజ్జనం చేశారు. డీఐ రోడ్డులోని శ్రీశివశక్తి వినాయక మండపాన్ని ఎమ్మెల్యే జగన్మోహన్ సందర్శించి, పూజలు చేశారు. 75 దొడిపల్లె శ్రీవిజయ వినాయక చవితి ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన 40 అడుగుల భారీ ప్రతిమ వద్ద శనివారం వివిధరకాల నృత్య పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేశా

● మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని 180 చిన్న, పెద్ద ఆలయాలు అభివృద్ధికి కృషి చేశానని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. పాపిరెడ్డిపల్లె పంచాయతీ పెద్దకొండేపల్లెకు సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న కనుగొండరాయస్వామి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి, మీడియాతో మాట్లాడారు. అనంతరం గంగాధరనెల్లూరు పంచాయతీ కట్టకిందపల్లె దళితవాడలో చిన్నపాపమ్మ మృతదేహం వద్ద నివాళి అర్పించారు. వైసీపీ నేతలు చిన్నమరెడ్డి, వెంకటరెడ్డి, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

మొగిలీశ్వరుడి హుండీ ఆదాయం రూ.3.98 లక్షలు

బంగారుపాళ్యం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మొగిలిలోని కామాక్షి సమేత మొగిలీశ్వరుడి హుండీ లెక్కింపు ద్వారా రూ.3,98,095 ఆదాయం వచ్చినట్లు ఈవో మునిరాజా తెలిపారు. శనివారం ఆలయంలో హుండీ లెక్కింపు చిత్తూరు దేవదాయశాఖ సీనియర్ అసిస్టెంట్ శ్వేత పర్యవేక్షణలో జరిగింది. మూడు నెలలకు రూ.3,52,276 రాగా, అన్నదానం ద్వారా రూ.45,819 వచ్చింది. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబీ విజయకుమార్, గ్రామస్థులు ధనుంజయనాయుడు, ప్రసాద్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక ప్రతిమ ఏర్పాటు



చిత్తూరు అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంలో శనివారం వినాయక ప్రతిమను ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) నాగేంద్ర ఆధ్వర్యంలో అర్చకులు పూజలు చేశారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ శుభప్రద, బిల్డింగ్ సూపర్‌వైజర్ బాలాజి, సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు సూపర్ హిట్ / ఎమ్మెల్యే భానుప్రకాష్


మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అని నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ తెలిపారు. నగరి మార్కెట్ కమిటీ యార్డులో శనివారం స్త్రీశక్తి పథకం విజయవంతంపై జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో ఇప్పటికే మూడు కోట్ల మంది మహిళలు ఉచిత బస్సుప్రయాణం చేశారన్నారు. సీఎం చంద్రబాబు ఏ పథకాన్ని అయినా మహిళల కోసమే అమలు చేస్తున్నారని చెప్పారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఆర్డీవో అనుపమ,తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో కృష్ణయ్య, నగరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు గుణశేఖర్, కార్యదర్శి శ్రీనివాసన్, మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, కార్యదర్శి వేణు, పీఏసీఏస్ ఛైర్మన్ బాలాజీ, తెలుగు మహిళా అధికారప్రతినిధి మీరా కుమారి, నేతలు కృష్ణారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, షణ్ముగంరెడ్డి జీవరత్నంనాయుడు, బాబునాయుడు నారాయణస్వామి నాయుడు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

వేల్కూరులో గ్రామసభ

గంగాధరనెల్లూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వేల్కూరు సచివాలయంలో రైతులతో శనివారం అధికారులు రీసర్వే గ్రామసభ నిర్వహించారు. 110 జాయింట్ ఎల్‌పీఎంలను విడదీయడానికి 60మంది రైతులు ఆమోదించినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సర్పంచ్ లలితమ్మ, రీసర్వే డీటీ శోభారాణి, మండల సర్వేయర్ గణేష్, వీఆర్వో ఉమ పాల్గొన్నారు.




కాణిపాక వరసిద్ధుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవర్లను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఉభయదారులు, ఆలయ ఈవో పెంచలకిషోర్ తదితరులు - ఆస్థాన మండపంలో నృత్యం చేస్తున్న కళాకారులు - ఉదయం జరిగిన గ్రామోత్సవంలో కోలాట భజన బృందం

నగరి ఏఎంసీ ఛైర్‌పర్సన్‌కు పరామర్శ

విజయపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మహారాజపురంలో నగరి ఏఎంసీ ఛైర్‌పర్సన్ రాజమ్మను శనివారం ఎమ్మెల్యే భానుప్రకాష్ పరామర్శించారు. ఆమె భర్త టీడీపీ సీనియర్ నేత, సుబ్రహ్మణ్యంరాజు ఇటీవల మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, కుటుంబీకులను పరామర్శించి, పార్టీ అండగా ఉంటామని చెప్పారు. లోకేష్, మునిభాస్కర్‌రాజు, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్


బాధితుడికి చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో మెరుగైన చికిత్స చేయించుకోలేని నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. శనివారం బొమ్మసముద్రం పంచాయతీకి చెందిన మురళీ మోహన్‌కు రూ.53,842, గుడిపాల పంచాయతీకి చెందిన పుష్పకు రూ.40,181, గట్రాళ్లమిట్టకు చెందిన చంద్రమోహన్‌కు రూ.43,460, పానాటూరుకు చెందిన భక్తవత్సల రెడ్డికి రూ.95వేలకు సంబంధించిన చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

ఘనంగా తెలుగు భాషోత్సవాలు


రవిచంద్ర దంపతులను సత్కరిస్తున్న నరసం ప్రతినిధులు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): హయగ్రీవ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం(నరసం) ఆధ్వర్యంలో తెలుగు భాషోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. తెలుగు సాహితీ సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు తులసీ నాథం నాయుడు, రవిచంద్ర, రాణి చంద్రశేఖర్, కుమార్, రమేష్, చంద్రకళ, విమల తదితరులు పాల్గొన్నారు,

మహిళల పక్షపాతి సీఎం చంద్రబాబు

● స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీలో భానుప్రకాష్


మహారాజపురంలో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేసిన భానుప్రకాష్

విజయపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మహిళల పక్షపాతి అని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. శనివారం మహారాజపురంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసి, ప్రసంగించారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంతోపాటు రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఆర్డీవో అనుపమ, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రాజేంద్ర, టీడీపీ బీసీసెల్ రాష్ట్రఅధికారప్రతినిధి ధనుంజయయాదవ్, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల పార్టీ అధ్యక్షుడు రమేష్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, నేతలు పురుషోత్తం, దశరథరాజు, లోకేష్‌రాజు, కొండూరు దాము, సతీష్‌రాజు పాల్గొన్నారు.

నింద్ర: మండల కేంద్రంలోనూ స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నగరి ఆర్డీవో అనుపమ, తహసీల్దార్ శేషగిరిరావు, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మిద్దె నుంచి పడి దివ్యాంగురాలి మృతి

చిత్తూరు అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మిద్దె నుంచి పడి ఓ దివ్యాంగురాలు మృతి చెందారు. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. సంతపేట విజయలక్ష్మి కాలనీకి చెందిన దివ్యాంగురాలైన ధనలక్ష్మి (57) శనివారం మధ్యాహ్నం మిద్దెపై దుస్తులను ఆరబెట్టడానికి వెళ్లింది. మెట్లెక్కుతుండగా కాలుజారి కిందపడింది. కొంతసేపటికి తర్వాత కుటుంబీకులు గమనించి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఇంట్లో బంగారం, నగదు చోరీ

శ్రీరంగరాజపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో బంగారం, నగదు చోరీకి గురయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ఒడ్డుపల్లెకు చెందిన బి.భాస్కర్ నాయుడు తన కుటుంబీకులతో కలసి శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి చిత్తూరు ఆస్పత్రికి వెళ్లాడు. రాత్రి అక్కడున్న బంధువుల ఇంట్లో నిద్రించారు. శనివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు పగులకొట్టి ఉన్నాయి. లోపలికెళ్లగా బీరువా కూడా పగలగొట్టి ఉంది. అందులోని 45 గ్రాముల బంగారం, రూ.50వేలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు బాధితులు సమాచారం ఇచ్చారు.

చాలీచాలని నిధులతో పనులెలా పూర్తి చేయాలి?

● నగరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల ఆవేదన


సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్

నగరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చాలీచాలని నిధులతో పనులెలా పూర్తి చేయాలని అధికారులను కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. నగరి మున్సిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టిన అజెండాలోని పనులపై చర్చించారు. రూ.10లక్షలు అవసరమైన పనులకు రూ.5లక్షలు పెడితే ఎలా అని కౌన్సిలర్ దయానిధి ప్రశ్నించారు. రాసప్పకాలనీలో డ్రైనేజీ, సిమెంటురోడ్డు సమస్య పరిష్కరించాలంటే రూ.10 లక్షలకుపైగా అవుతుందని, దీనికి కూడా రూ.5లక్షలు కేటాయిస్తే ఎలా అన్నారు. రూ.2కోట్లకు పెట్టిన పనుల ప్రతిపాదనలు పక్కన పెట్టమని ఛైర్మన్ నీలమేఘం చెప్పగా, ఆరో వార్డు కౌన్సిలర్ సాయిసంధ్యారాణి మాట్లాడుతూ.. గతంలో కూడా ఇలా చేసే నిధులు వెనక్కి వెళ్లాయన్నారు. ప్రతిపాదించిన అన్ని పనులకూ అంగీకారం కుదిరితేనే టెండర్ పిలవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. కమిషనర్ కృష్ణారెడ్డి, వైస్ ఛైర్మన్ బాలన్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళతా

మాజీ ఎమ్మెల్సీ దొరబాబు

బంగారుపాళ్యం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలోని సమస్యలను మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. శనివారం బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన క్లస్టర్ టీచర్ల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు గంటా మోహన్ పలు సమస్యలను ప్రస్తావించారు. ఇన్‌చార్జి హెచ్ఎం జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు జయకుమార్, ఉషారాణి, హరి, కృష్ణయ్య. సుశీల తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన చిత్తూరు నాయకులు


చంద్రబాబుతో మాట్లాడుతున్న దొరబాబు, హేమలత, చిట్టిబాబు తదితరులు

చిత్తూరు సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును చిత్తూరు నాయకులు శనివారం కుప్పంలో కలిశారు. డీకే బద్రినారాయణను, రాజశేఖర్ నాయుడిని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పరిచయం చేశారు. చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ తదితరులు సీఎంను కలిసినవారిలో ఉన్నారు. హంద్రీ-నీవా నీళ్లను జిల్లాకు తేవడంపై కృతజ్ఞతలు తెలిపారు.

మా గుడిసెలను ఖాళీ చేయాలట

● అగ్రవర్ణాల దౌర్జన్యంపై విచారించి, న్యాయం చేయండి
● దళితుల వినతి


మీడియాకు సమస్య తెలియజేస్తున్న బాధితులు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తమ గుడిసెలను ఖాళీ చేయాలని అగ్రవర్ణాల వారు దౌర్జన్యం చేస్తున్నారని ఎస్ఆర్‌పురంలో భారతమిట్ట పరిధి అటవీ ప్రాంతంలోని దళితులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు శనివారం వారు మీడియా ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. 20ఏళ్లుగా ఇక్కడ ఐదు కుటుంబాలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నాయి. ఇపుడు కొందరు అగ్రవర్ణాల వారొచ్చి గుడిసెలను ఖాళీ చేయమని బెదిరిస్తున్నారు. కాగా, ఎమ్మెల్యే థామస్ జన్మదిన సందర్భంగా తన వద్ద పెరుగుతున్న తల్లిదండ్రులు వదిలేసిన నలుగురు పిల్లల చదువు కోసం రూ.లక్ష చెక్కును కూడా ఇచ్చారని వళ్లెమ్మ తెలిపారు. ఇకనైనా ఎమ్మెల్యే, కలెక్టర్‌లు విచారించి, న్యాయం చేయాలని వేడుకున్నారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశామన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

గంగాధరనెల్లూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నెల్లేపల్లె దళితవాడలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై స్థానికులకు తహసీల్దార్ శ్రీనివాసులు వివరించారు. పలు సమస్యలను స్థానికులు ప్రస్తావించగా పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, సర్పంచ్ గంగయ్య యాదవ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల వివరాలు తెలియజేయరా? / వెదురుకుప్పం మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యురాలి ధ్వజం


సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ నాగరాణి తదితరులు

వెదురుకుప్పం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనుల వివరాలను ప్రజాప్రతినిధులకు తెలియజేయరా? అంటూ ఏపీవో మీనాకుమారిపై వెదురుకుప్పం ఎంపీటీసీ సభ్యురాలు ఎన్.రాధిక ధ్వజమెత్తారు. శనివారం ఎంపీడీవో సమావేశపు మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ నాగరాణి అధ్యక్షత జరిగింది. జడ్పీటీసీ చలంపాళ్యం సుకుమార్ కూడా ఇదే అంశంపై మాట్లాడారు. వెదురుకుప్పంలో ఇరిగేషన్‌శాఖ ఏఈ అందుబాటులో ఉండటం లేదని ఎంపీటీసీ తెలిపారు. కొమరగుంట పంచాయతీ పరిధిలో సర్పంచ్, ఎంపీటీసీకి సమాచారం లేకుండా క్వారీ అనుమతులు ఎలా ఇస్తారని ఎంపీటీసీ మునిచంద్రారెడ్డి ప్రశ్నించారు. సర్పంచులు కూడా పలు సమస్యలను లేవనెత్తారు. సమావేశంలో చర్చించిన సమస్యలకు పరిష్కారం చూపడం లేదని కో-ఆప్షన్ మెంబరు వెంకటేశులు విమర్శించారు. పోలీసు, రెవెన్యూ శాఖలు సమావేశానికి పిలిపించాలని లేదంటే నిష్క్రమిస్తామని బొమ్మయ్యపల్లె ఎంపీటీసీ కొత్తపల్లి భాస్కర్ హెచ్చరించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండలాభివృద్ధికి సహకరించాలని కోరారు. పీఏసీఎస్ ఛైర్మన్ బోడిరెడ్డి సుధాకరరెడ్డి, తహసీల్దార్ బాబు, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, వివిధ శాఖ ఉద్యోగులు హాజరయ్యారు.

సంక్షిప్తంగా..

భక్తులకు అన్నదానం

వెదురుకుప్పం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగర రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం భక్తులకు అన్నదానం చేశారు. కార్వేటినగరానికి చెందిన కృష్ణస్వామి, చక్రవర్తి వితరణతో ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు సురేష్‌బాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

యాదమరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్య జూనియర్ కాలేజ్‌లో శనివారం హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నిపుణులు వ్యాధి నివారణ చర్యలు, తదితరాలను తెలియజేశారు. కోర్ ప్రాజెక్టు మేనేజర్ సద్దాం, ప్రిన్సిపాల్ ద్రాక్షాయణి, సెల్వి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సత్కారం



వెదురుకుప్పం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణిని జీడీనెల్లూరు మహిళా అధ్యక్షురాలు ఎన్.రాధిక నెల్లూరులో శనివారం కలిశారు. అనంతరం ఆమెను సత్కరించారు.

సన్మానం



చిత్తూరు సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు టౌన్ బ్యాంక్ ఛైర్మన్‌గా నియమితులైన కాండ్ర రమేష్ నాయుడిని టీడీపీ నేతలు సన్మానించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సురేంద్ర కుమార్, సప్తగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ ఫ్యాన్ల వితరణ



గంగాధరనెల్లూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు హైస్కూల్‌కు గ్రామానికి ఇడవలపాటి తులసీరామ్ శనివారం 28 సీలింగ్ ఫ్యాన్లను వితరణ చేశారు. తాను ఇదే స్కూల్‌లో 1990-91లో పదో తరగతి చదువుకున్నానని చెప్పారు. తమకు పాఠాలు చెప్పిన టీచర్ గుర్రప్పనాయుడు ద్వారా హెచ్ఎం సుబ్బరామయ్యకు ఫ్యాన్లను అందజేశారు. పూర్వ విద్యార్థులు హరిబాబు (మండల వైస్ ఎంపీపీ), రవిచంద్ర, ప్రకాష్ నాయుడు, గాంధీనాయుడు, కుమారి తదితరులు పాల్గొన్నారు.

బస్సు కింద పడి వృద్ధురాలి దుర్మరణం


నారాయణమ్మ (ఫైల్ ఫొటో)

తవణంపల్లె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బస్సు కింద పడి ఓ వృద్ధురాలు దుర్మరణం చెందారు. తవణంపల్లె పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగవరం మండలం కీలపట్ల హరిజనవాడకు చెందిన లేట్ మునిరత్నం భార్య నారాయణమ్మ(70) తన మనవడు మునీంద్రతో కలిసి బైక్‌పై శనివారం కాణిపాకం దైవ దర్శనం కోసం బయల్దేరారు. తవణంపల్లె వెలుగు మార్టు వద్దకొచ్చేసరికి ఎదురుగా చిత్తూరు నుంచి అరగొండ వైపు వస్తుండిన ఆర్టీసీ బస్సు డ్రైవరు నిర్లక్ష్యంగా నడపడంతో వృద్ధురాలి భుజానికి బస్సు తగిలి ఇద్దరూ కిందపడ్డారు. వృద్ధురాలు మాత్రం బస్సు వెనుక చక్రాల కిందపడటంతో తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. మనవడికి ఎటువంటి గాయాలవలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కొటేషన్ల ఆహ్వానం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయంలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు దసరా ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో అమ్మవారి అలంకరణ వస్తువులు, పూలు, బ్యాండు, పంబలు, స్టీలు తట్టలు, శాలువాలు, మోత కూలీలు, వంటమాస్టరు, కూలీల సరఫరా, అన్నప్రసాదాల తయారీ, ఫొటో, వీడియోగ్రఫీకి కాంట్రాక్టర్ల నుంచి కొటేషన్లు ఆహ్వానిస్తున్నారు. వచ్చేనెల పదో తేదీలోపు ఆలయ పరిపాలన కార్యాలయంలో సమర్పించాలని ఈవో తిమ్మారెడ్డి కోరారు.